క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 16న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ ఇన్‌చార్జ్ డీఈ పి.తిరుపతి తెలిపారు. శివనగర్, చింతల్, ఏఎస్.రెడ్డి నగర్, తూర్పు కోట పడమర కోట, మధ్య కోట, పుప్పాల గుట్ట, పైడిపల్లి, ఆజంజాహి మిల్, ఏఎస్ఎం కళాశాల, తహసీల్దార్ కార్యాలయం, ఎస్ఆర్ఆర్ తోట, శాంతినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటినుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలో గౌరీశంకర ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నారు. రెండు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జలాధివాసం సాగనుందని, సోమవారం ఉదయం 9.15 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉంటుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

గట్టు ఉదయ్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హైదరాబాద్ మొయినాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ గణితశాస్త్ర విభాగం పరిశోధకుడు గట్టు ఉదయ్‌కు ఆ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. స్టడీ ఆఫ్ సమ్ మ్యాథమెటికల్ యాస్పెక్ట్స్ ఆఫ్ మోడలింగ్ ఇన్ బయోసైన్సెస్ -మల్టిపుల్ ఇంటరాక్టింగ్ స్పీసెస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మడికొండకు చెందిన గట్టు ఉదయ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు. మ్యాథ్‌మెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం ప్రొఫెసర్ హరిప్రసాద్ పర్యవేక్షణలో ఉదయ్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

పుస్తె, మట్టెల అందజేత



ఖిలా వరంగల్: ఓ పేదింటి యువతి వివాహానికి పుస్తె మట్టెలు, నగదు సాయం అందజేసి కాంగ్రెస్ నేత కరాటే ప్రభాకర్ తన సేవా దాతృత్వాన్ని చాటుకున్నారు. వరంగల్ శివనగర్‌కు చెందిన కానిగంటి గురునాథ్, మంజుల దంపతులిద్దరు భవన నిర్మాణ కార్మికులు పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆ దంపతుల రెండో కుమార్తె సాధనను వడ్డె సతీష్‌కుమార్‌కు ఇచ్చి శనివారం వివాహం చేశారు. కార్యక్రమంలో కొయ్యాడ ఉమ, అజీర, అంజమ్మ, కోతి స్వరూప, రమ, ఉమ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



హన్మకొండ అర్బన్: హనుమకొండ మల్లికాంబ మనోవికాస కేంద్రంలో శనివారం సాయంత్రం బధిర (మూగ, చెవిటి) విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ ల్యాబ్‌ను ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి ప్రారంభించారు. మెంఫిస్ తెలుగు సమితి న్యూజెర్సీ అమెరికా సహకారంతో కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా కంప్యూటర్లకు తగిన ల్యాబ్‌ను ఏర్పాటు చేసి ఆయన ప్రారంభించారు. దాతలకు సంస్థ నిర్వాహకురాలు బండా రామలీల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోడం కల్యాణ్, తోపుచర్ల నిఖిల్ పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలి

వరంగల్: బీజేపీ మద్దతులో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలంటూ పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ 21వ డివిజన్‌లో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకుడు సముద్రాల పరమేశ్వర్ ఓబీసీ మోర్చా నాయకులు బైరి మురళీకృష్ణ, అపురూప రజనీష్‌నేత, కందుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమావేశానికి తరలిన నాయకులు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్ లాలాగూడ వర్క్‌షాప్ వద్ద శనివారం జరిగిన సమావేశానికి కాజీపేట జంక్షన్ నుంచి పలువురు రైల్వే నాయకులు తరలివెళ్లారు. రైల్వే ఎంప్లాయీస్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం ఆధ్వర్యంలో రైల్వే కార్మికులకు పాత పెన్షన్ స్కీంనే అమలు చేయాలని నిర్వహించిన సమావేశానికి నాయకులు తరలివెళ్లారు.

ట్రాఫిక్‌పై అవగాహన కల్పించాలి

హసన్‌పర్తి: విద్యార్థుల్లో రహదారి భద్రత, ట్రాఫిక్ అవగాహన పెంపొందించడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని రవాణాశాఖ కమిషనర్ కె.సురేంద్ర మోహన్ సూచించారు. కమిషనర్ సరేంద్రమోహన్‌ను ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి, రెజోనెన్స్ విద్యాసంస్థల చైర్మన్ నాగేంద్రకుమార్, కేఎస్ఆర్ పబ్లికేషన్, ప్రింటర్స్ అధినేత డాక్టర్ కేఎస్ఆర్.శ్రీనివాస్ హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

కలగానే మడికొండ జంక్షన్ అభివృద్ధి

- కూడలి సుందరీకరణకు ఎనిమిది ఏళ్లుగా ఎదురుచూపులు
- మార్కింగ్ చేసి వదిలేసిన అధికారులు



అభివృద్ధికి నోచుకోని మడికొండ చౌరస్తా



మడికొండ చౌరస్తాను పరిశీలిస్తున్న అప్పటి మున్సిపల్ కమిషనర్ శృతి ఓజా

మడికొండ: జాతీయ రహదారిలోని కాజీపేట మండలం మడికొండ జంక్షన్‌ను అభివృద్ధి చేస్తామని అప్పటి మేయర్ నన్నపునేని నరేందర్, మున్సిపల్ కమిషనర్ శృతిఓజా జంక్షన్ కొలతలు వేయించి మార్కింగ్ చేయించారు. ఇప్పటికి 8 ఏళ్లు అవుతున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కూడలి విస్తరణకు అధికారులు మార్కింగ్ చేయడంతో స్థానిక వ్యాపారులు ఆందోళనలో పడ్డారు. తమ షాపులు ఉంటాయో ఊడుతాయో అని మదనపడుతున్నారు. విస్తరణలో కొన్ని షాపులు సగం వరకు పోతుండగా, మరికొన్ని షాపులు, ఇళ్లు పూర్తిగా పోతున్నాయి. దాంతో వ్యాపారులు షాపులను అభివృద్ధి చేసుకోవడానికి జంకుతున్నారు.

జంక్షన్‌లో ప్రయాణికుల ఇక్కట్లు

సౌకర్యాలు లేక మడికొండ జంక్షన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల కోసం వేచి ఉండడానికి కనీసం బస్‌షెల్టర్ లేదు. టాయిలెట్లు లేకపోవడంతో మహిళలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొద్ది రోజులుగా సెంట్రల్ లైటింగ్ సైతం వెలగడం లేదని స్థానికులు వాపోతున్నారు. జనగామ, ధర్మసాగర్, వేలేరు, కాజీపేట, స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూర్, తదితర మండలాలకు వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం. ప్రతీరోజు వివిధ పనుల నిమిత్తం నగరానికి ఆయా గ్రామాల ప్రజలు మడికొండ జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జంక్షన్ అభివృద్ధి చేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

జంక్షన్‌ను అభివృద్ధి చేయాలి



మడికొండ జంక్షన్‌ను గతంలో అప్పటి మేయర్, కమిషనర్ పరిశీలించి అభివృద్ధి పనులకు మార్కింగ్ చేశారు. ఇప్పటికి 8 ఏళ్లు గడుస్తున్నా అతీగతి లేదు. జంక్షన్ అభివృద్ధి చెందుతుందో లేదో తెలియడం లేదు. ప్రయాణికుల సౌకర్యార్థం కూడలిని అభివృద్ధి చేసి బస్‌షెల్టర్‌తో పాటు టాయిలెట్లు నిర్మించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జంక్షన్ అభివృద్ధిపై దృష్టి సారించాలి.

\- పొనగోటి వెంకట్‌రావు, స్థానికుడు

సౌకర్యాలు లేక ఇక్కట్లు



జంక్షన్‌లో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండలేక వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండ, వానకు షాపు ముందు నిలబడితే దుకాణాల యజమానులు ప్రయాణికులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బస్ షెల్టర్ నిర్మించి, సౌకర్యాలు కల్పించాలి.

\- అంకేశ్వరపు రమేష్, స్థానికుడు

వారంలో మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్ సిద్ధం

- నగర మేయర్ గుండు సుధారాణి



ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మేయర్

వరంగల్ అర్బన్ : స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా చేపడుతున్న మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ) 150 కేఎల్‌డీల ప్లాంట్ వారం రోజుల్లో సిద్ధమవుతుందని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం అమ్మవారిపేటలోని ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌ను సందర్శించిన ఆమె పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పరిధిలోని నివాసాలు, కమర్షియల్ భవనాల నుంచి వెలువడే మానవ వ్యర్థాలను అమ్మవారిపేటలోని ఎఫ్ఎస్‌టీపీ కేంద్రాలకే తరలించాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ డ్రైవర్లు, క్లీనర్లు మానవ వ్యర్థాలను ఎట్టిపరిస్థితుల్లో ఇతర ప్రాంతాల్లో వదిలివేయవద్దని, బహిరంగ ప్రదేశాల్లో డంప్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2025 పోటీల్లో భాగంగా స్వచ్ఛత విధానాలు అమలు చేయాలని, రెండు కేంద్రాలు నిరంతరంగా నడిపించాలని సాంకేతిక నిపుణులను ఆదేశించారు. మోటార్ల మరమ్మతుల కేంద్రం కారణంగా ప్లాంట్ ఆగిపోయిందని, యుద్ధప్రతిపాదికన పనులు పూర్తి చేయాలని చెప్పారు.

ఎందుకింత నిర్లక్ష్యం?

- వాహనాల మరమ్మతుపై కమిషనర్ ఆగ్రహం



వరంగల్ అర్బన్ : ఎన్నిమార్లు తనిఖీ చేసి హెచ్చరించినా వాహనాల మరమ్మతు పనుల్లో ఎందుకింత నిర్లక్ష్యం.. మీరు మారరా? అంటూ గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఇంజినీర్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం హన్మకొండ బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డును సందర్శించిన ఆమె మరమ్మతులకు గురైన వాహనాల వివరాలు, వారంటీతో షో రూమ్‌లకు తరలించి మరమ్మతు చేపట్టాల్సిన భారీ వాహనాల గురించి తెలుసుకున్నారు. షెడ్డులో నిరుపయోగంగా ఉన్న వాహనాల జాబితాతోపాటు అందుకు కారణాలు నివేదించాలని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈ మహేందర్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, ఏఈ ఫణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్, స్మార్ట్ సిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతలక్ష్మి ఆస్పత్రిలో మందుల్లేవ్



వినతి పత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్లు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని అనంతలక్ష్మి ఆయుర్వేద బోధన ఆస్పత్రిలో మందుల కొరతను అధికారులు తీర్చకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని విద్యారణ్యపురి, గోపాలపురం ప్రాంతాలకు చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈమేరకు మందుల కొరతను తీర్చాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మావతికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా ఆస్పత్రిలో మందుల కొరతతో అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా వంద పడకల ఆస్పత్రికి జనరేటర్ సౌకర్యం లేకపోవడం, తరచూ విద్యుత్ అంతరాయంతో వైద్య సేవలు పరీక్షలు నిలిచిపోతున్నాయని వాపోయారు. ఈ విషయాలపై పలుమార్లు ఆయూష్ కమిషనర్, అడిషనల్ డైరెక్టర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తేరాల యుగంధర్, పరికిపండ్ల వేణు, వెలుదండి సుమలత, కొండేటి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్ఎఫ్ ఒలింపియాడ్‌లో 'శివాని' విద్యార్థుల విజయభేరి



షినిత



శ్రీచాణిస్య



సాయిరిషి

హసన్‌పర్తి: ఎస్సార్ఎఫ్ సైన్స్ ఒలింపియాడ్‌లో భీమారంలోని శివాని పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారని శివానీ విద్యాసంస్థల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి తెలిపారు. పాఠశాలకు చెందిన వి.షినిత రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు, ఎ.శ్రీచాణిస్య రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, పి.సాయిరిషి జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారని వివరించారు. ఈమేరకు వారిని అభినందించినట్లు తెలిపారు.

వృక్షార్చనను విజయవంతం చేయాలి



మొక్క నాటి సెల్ఫీ దిగుతున్న నరేందర్

ఖిలా వరంగల్: ఈనెల 17న మాజీ సీఎం కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించే వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ పేరుతో మొక్కలు నాటాలని మాజీ ఎంపి జోగినపల్లి సంతోష్‌కుమార్ పిలుపులో భాగంగా వరంగల్ శంభునిపేట ప్రతాప్‌నగర్‌లోని నాగేంద్రస్వామి దేవాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో తూర్పు బీఆర్ఎస్ నాయకులతో కలిసి నరేందర్.. మూడు మొక్కలు నాటి, వృక్షార్చన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్త కనీసం మూడు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ టీ.రమేష్‌బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలపై నిరంతరం నిఘా ఉంచాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకన్న

హసన్‌పర్తి: మహిళలు ఆపదలో ఉన్నప్పుడు హెల్ప్ లైన్ 1091, 181 నంబర్లకు డయల్ చేయాలని ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ వెంకన్న అన్నారు. ఎల్లాపురంలోని మహాత్మా జ్యోతిరావు పూలే, సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల (వర్ధన్నపేట)లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయల్ 1098, 181, 100 గురించి వివరించారు. పిల్లలు మొబైల్‌కు దూరంగా ఉండేలా, తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. బాల్య వివాహాలను నేరంగా పరిగణించాలని చెప్పారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో షేర్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శిరీష, సీడబ్ల్యూసీ సభ్యురాలు రాజ్యలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత, ఎస్సై భాగ్యలక్ష్మి, సిబ్బంది రామారావు, సయ్యద్ మెహసిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రజెంటేషన్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన తాళ్ల పద్మావతి విద్యార్థినులు

ఖిలా వరంగల్: ఇటీవల కనెక్టింగ్ ది వరల్డ్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ప్రపంచ ప్రజెంటేషన్ పోటీల్లో 15 దేశాలు పాల్గొనగా.. ఇండియా తరపున పాల్గొన్న వరంగల్ తాళ్ల పద్మావతి అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని స్కూల్ యాజమాన్యం తెలిపింది. మన చుట్టూ ఉన్న సామాజిక సమస్యలు అనే అంశంపై సాయి, హన్విత్, హనీఫ్, నేత్రానంద, హరిప్రియ, కుశాల్, అజీజ్, శ్రీనందన, కీర్తన, శ్రీవిద్య, నిత్య, మునజాఫియా, కార్తీక.. గ్రూప్ ప్రజెంటేషన్ ద్వారా తమ సృజనాత్మకతను చాటారు. ఈమేరకు ప్రశంస పత్రాలు, ఐడియన్స్ అవార్డు అందుకున్న ఆ విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు వైష్ణవి, వరుణ్, హెచ్ఎం స్వర్ణతగరం, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు శనివారం అభినందించారు.

శంభులింగేశ్వరుడి గుడిని అభివృద్ధి చేయాలి



ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన స్వయంభూ శంభులింగేశ్వర స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని, ఈనెల 26న జరగనున్న శివరాత్రికి కనీస సౌకర్యాలు కల్పించాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మధ్యకోటలోని శంభులింగేశ్వరస్వామి ఆలయాన్ని ఓబీసీ మోర్చా నాయకులతో కలిసి ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక దేవాలయ ప్రాంగణం చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు బిల్లా కిశోర్, బొలుగొడ్డు సతీష్, అమృత్ వర్మ, ఏసీరెడ్డి రంజిత్, బేర నరేందర్, దేవర కమలాకర్, కార్తీక్, రాము, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయంప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ



నిరసన తెలుపుతున్న నాయకులు

కేయూ క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూజీసీ నూతన ముసాయిదా -2025 దేశ సమైక్య స్ఫూర్తికి విరుద్ధమని, ఇది రాజ్యాంగం వివిధ రాష్ట్రాలకు కల్పించిన హక్కులను కాలరాయటమేనని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ విమర్శించారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ముసాయిదా పత్రాలను దహనం చేసి శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రపూరిత విధానాలను అనుసరిస్తోందని అన్నారు. విద్యారంగం పట్ల ఏమాత్రం అనుభవం లేని వివిధ రంగాల్లోని బడా కార్పొరేటర్లు, వ్యాపారవేత్తలను వీసీగా నియమించుకునే విధంగా యూజీసీ రూపొందించిన నూతన ముసాయిదాను ఉపసంహరించుకోవాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు, నాయకులు కావ్య, అనూష, కేయూ కన్వీనర్ బాలు, బాధ్యులు గణేష్, వినయ్, యాదగిరి, హరికృష్ణ, సాయి, శ్రీజ, సాధన, రాజశేఖర్, పృథ్వీరాజ్, చారి, దిలీప్ పాల్గొన్నారు.

ఆధునిక యుగంలో ఆటవిక చర్యలు



ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

హన్మకొండ: ఆధునిక యుగంలో ఆటవిక చర్యలకు పూనుకోవడం ఆందోళన కలిగిస్తోందని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, గోర్ సభ జాతీయ నాయకుడు జైసింగ్ రాథోడ్ అన్నారు. తమిళనాడు రాష్ట్రం శివగంగ జిల్లా మానామధురైకి చెందిన దళిత విద్యార్థి అయ్యస్వామి చేతులు నరికిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద డీబీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుల్లెట్ వాహనం నడిపినందుకు రెండు చేతులు నరికివేయడంపై సభ్య సమాజం సిగ్గుతో తల దించుకోవాలన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ వెంటనే బాధిత కుటుంబాన్ని సందర్శించి కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. చట్టాన్ని చుట్టంలా మార్చుకుంటున్న మనువాద మానవ మృగాలను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టానికి పదునుపెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర వెంకట్, డీబీఎఫ్ నాయకులు సంపూర్ణ, కొమ్ముల కరుణాకర్, గోర్‌సభ రాష్ట్ర నాయకుడు ఉదయ్ సింగ్, ప్రజా సంఘాల నాయకులు రాజు, వెంకటరత్నం, నరేష్, కృష్ణ, కిరణ్, రాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సఖి సభ్యులు

ఖిలా వరంగల్: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సఖి కేంద్రం ప్రతినిధులు తిరుమల, స్వప్న సూచించారు. ఈమేరకు వరంగల్ 39వ డివిజన్ ఏకశిలనగర్ కమ్యూనిటీ హాల్‌లో సఖి కేంద్రం, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, సర్వోదయ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, మహిళా చట్టాలపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. మహిళలు, బాలికలకు రక్షణగా సఖి సెంటర్లు పనిచేస్తున్నాయని అన్నారు. న్యాయ సహాయం, వైద్య సహాయం, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి వంటి సేవలను ఉచితంగా 24గంటల పాటు అందిస్తున్నట్లు తెలిపారు. బాధిత మహిళలు, బాలికలు 181 నంబర్‌కు కాల్ చేసి తక్షణ రక్షణ పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఆర్పీలు విజయ, ఎమోలియా, సువర్ణ పాల్గొన్నారు.

అయ్యో దేవా.. గోడు ఆలకించేదెవరు?

- సంగెం, వర్ధన్నపేట, ఖిలా వరంగల్ మండలాలకు దేవాదుల నీరు బంద్
- ఎత్తిపోతల నీరు రాకుండా తూములు మూసిన ఐనవోలు మండల రైతులు



ఐనవోలు మండలంలో నిండుగా ప్రవహిస్తున్న కాల్వ

సంగెం: ఎప్పటిలాగే దేవాదుల ఎత్తిపోతల నీరు వస్తుందనే గంపెడాశతో సంగెం, వర్ధన్నపేట, ఖిలా వరంగల్ మండలాల్లోని పలు గ్రామాల రైతులు పంటలు సాగు చేశారు. కాల్వ వెంట ఉన్న సుమారు 2 వేల ఎకరాలతోపాటు కుంటలు, చెరువుల్లోకి సైతం నీరు వచ్చేదని రైతులు పేర్కొంటున్నారు. రైతులు రాత్రింబవళ్లు నిద్రాహారాలు మాని కాల్వ వెంట ఉంటూ సంగెం మండలం ఆశాలపల్లి, గవిచర్ల గ్రామాల్లోని పంటలకు నీరందించారు. తీరా చూస్తే 20 రోజులుగా చుక్క నీరు రావడం లేదు. ఎందుకని పలువురు రైతులు కాల్వ వెంట వెళ్లారు. ఐనవోలు మండలం వెంకటాపూర్ వద్ద వర్ధన్నపేట మండలం చెన్నారం, ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట, సంగెం మండలం ఆశాలపల్లి, కాట్రపల్లి, గవిచర్ల, తీగరాజుపల్లి, రామచంద్రాపురం, లోహిత, షాపూర్ తదితర గ్రామాలకు నీరు రాకుండా కాల్వ రెండు గేట్‌వాల్వ్‌లు పూర్తిగా మూసివేసి సిమెంట్ పోశారు. ఒక తూముకు అడ్డంగా సిమెంట్ పోయగా కొద్దిగా జాలు మాత్రమే వస్తోంది. దీంతో నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మూడు మండలాల్లోని గ్రామాల ఆయకట్టుకు దేవాదుల నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

గిరిజనుల ఆరాధ్యుడు సేవాలాల్

గిరిజనుల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని పలువురు వక్తలు కొనియాడారు. నగర వ్యాప్తంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బంజార జాతి జాగృతం కోసం తన జీవితాన్ని ధారపోసిన ధన్యజీవి సేవాలాల్ అని గుర్తుచేసుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్



యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో..



జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో..



హసన్‌పర్తి: 2వ డివిజన్ గుండ్లసింగారంలో..



వరంగల్ 43వ డివిజన్ నాయుడు పెట్రోల్‌బంక్ జంక్షన్ సమీపంలోని టీచర్స్ కాలనీలో..



బీఆర్ఎస్ హనుమకొండ కార్యాలయంలో సంత్ సేవాలాల్ జయంతిలో నాయకులు



ట్రాన్స్‌కో జోనల్ కార్యాలయంలో భోగ్ బండారో కార్యక్రమంలో విద్యుత్ ఎస్టీ ఉద్యోగులు



కాజీపేట డీజిల్ బ్రాంచ్ రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో..